# నిరంతర యజ్ఞంలా సీఎం కప్

**- తెలంగాణ మట్టిలో మాణిక్యాలను వెలిగితీస్తాం**
**- క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తాం**
**- సీఎం కప్ రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**






**హైదరాబాద్, మార్చి 24, (తెలంగాణ దిశ)** :మట్టిలోని మాణిక్యాల క్రీడా ప్రతిభను సానపెట్టేందుకే సీఎం కప్ పోటీ నిర్వహించామని, ఇది ఒక నిరంతర కార్యక్రమంలా కొనసాగిస్తామని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం ఎల్ బి ఇండోర్ స్టేడియంలో రెండవ విడత సీఎం కప్ పోటీల ముగింపు ఉత్సవాలు, రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ టీమ్లకు ట్రోఫీల బహుకరణ జరిగింది. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మట్టిలో మాణిక్యాలను గుర్తించేందుకే రెండు విడతలుగా సీఎం కప్ పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఇది ఒక నిరంతర ప్రక్రియ లాగా దీనిని ప్రతి సంవత్సరం కొనసాగిస్తామని తెలిపారు. క్రీడల్లో విజయం సాధించాలంటే కేవలం ప్రభుత్వ ప్రోత్సాహం మాత్రమే కాకుండా క్రీడాకారులకు కృషి పట్టుదల ఉండాలని అప్పుడు మాత్రమే క్రీడాకారులు చాంపియన్లుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. యువ క్రీడాకారులకు సైనా నెహ్వాల్ వంటి క్రీడాకారుల జీవితం స్ఫూర్తి కావాలని ఆయన అన్నారు. సీఎం కప్ పోటీలో పాల్గొన్న క్రీడాకారుల ప్రతిభ కనబరిచిన వారికి స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీలలో అవసరమైతే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ క్రీడా ప్రతిభ గుర్తింపు కోసమే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇది నిరంతరం కొనసాగిస్తామని ప్రకటించారు. క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు, ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కప్ పోటీల విజయవంతంలో క్రీడా సంఘాల భాగస్వామ్యం ఎంతో ఉందని, ఎన్నో ప్రభుత్వ శాఖలు విభాగాలు సహకారం వల్లనే పోటీలు విజయవంతంగా కొనసాగాయని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ సీఎం కప్ పోటీలలో దాదాపు 5 లక్షల 40 వేల మంది క్రీడాకారులు ఆన్ లైన్ నమోదు చేసుకోగా, వారి సంపూర్ణ సమాచారాన్ని క్రీడా అవసరాలకు అనుగుణంగా క్రోడీకరిస్తున్నామని తెలిపారు.

**ఓవరాల్ ఛాంపియన్ గా అదిలాబాద్**

గ్రామీణ, మండల, అసెంబ్లీ, జిల్లా, రాష్ట్ర స్థాయి ఐదంచల్లో కొనసాగిన ఈ పోటీల్లో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచింది. రెండవ స్థానంలో రంగారెడ్డి జిల్లా, మూడవ స్థానంలో కరీంనగర్ జిల్లా నిలిచాయి. విజేతలకు మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, సైనా నెహ్వాల్, సోని బాలాదేవిలు ట్రోఫీలు అందజేశారు. సీఎం కప్ పోటీల విజయవంతం కోసం కృషి చేసిన వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థల ప్రతినిధులకు స్పోర్ట్స్ అథారిటీ ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల డివైఎస్ఓలు, క్రీడా సంఘాల ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ కోచులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## 28న జాతీయ లోక్ అదాలత్




**కుషాయిగూడ, మార్చి 24, తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మల్కాజిగిరి జిల్లా కోర్టు పరిధిలో ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని కోర్టు భవన సముదాయాల్లో ఈ లోక్ అదాలత్‌కు కక్షిదారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ కేసులను పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా సివిల్ కేసులు, ఫ్యామిలీ వివాదాలు, బ్యాంకు రికవరీ, చెక్కు బౌన్స్, భూ వివాదాలకు సంబంధించిన కేసులు ప్రధానంగా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన, తక్కువ ఖర్చుతో పరిష్కరించుకునే ఉత్తమ వేదిక లోక్ అదాలత్ అని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని న్యాయ సమస్యలను సులభంగా ముగించుకోవాలని సూచించారు.



శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీ నరసింహ స్వామి వారిని మంగళవారం తెలంగాణ పశు సంక్షేమ శాఖ జాయి ంట్ సెక్రెటరీ, మేడ్చల్ జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్ దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అనంతరం ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మి నారాయణ, ధర్మకర్త శ్రీహరి చేతుల మీదుగా స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదంతో పాటు ఆశీర్వచనం అందజేశారు.

**(కీసర, తెలంగాణ దిశ)**

# బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం





**సికింద్రాబాద్, మార్చి 24, (తెలంగాణ దిశ)** : బొల్లారం రాష్ట్రపతి నిలయంలో మంగళవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది నీరు, లింగం అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమం సమాన నీటి ప్రాప్యత ప్రాముఖ్యతను, సమాజంపై దాని ప్రభావాన్ని ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో సుమారు 560 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నీటి సంరక్షణ, లింగ సమానత్వం వంటి అంశాలపై వక్తృత్వం, నినాదాల రచన పోటీలు నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థులకు రాష్ట్రపతి నిలయంలో పునరుద్ధరించబడిన సాంప్రదాయ నీటిపారుదల వ్యవస్థలను సందర్శించే అవకాశం కల్పించారు. పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధనా సంస్థ (ఈపిటిఆర్ఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యా స్టాల్స్ ద్వారా సుస్థిర నీటి వినియోగ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా నిపుణుల సెమినార్‌లు నిర్వహించారు. ఈపిటిఆర్ఐ, సమాచార అధికారి ప్రశాంతి మిషన్ లైఫ్‌పై ప్రసంగించారు. అలాగే వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (వలమతారి) డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి కె. సునీత నీరు, లింగం అంశంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఆర్‌టీఐ కమిషనర్, పర్యావరణవేత్త దిలీప్ రెడ్డి నీటి సంరక్షణ, సమ్మిళిత విధానాల అవసరాన్ని వివరించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. రాష్ట్రపతి నిలయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి మూడు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ కార్యక్రమం ప్రత్యేకత సంతరించుకుంది. ఇప్పటివరకు సుమారు 8.45 లక్షల మంది సందర్శించగా, వారిలో 60 శాతం మంది విద్యార్థులేనని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణ, నీటి స్థిరత్వంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

# పర్ణశాల బోటింగ్‌లో నిర్లక్ష్యం... భక్తుల ప్రాణాలకు ముప్పు?





**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 24, (తెలంగాణ దిశ)** : పర్ణశాలలో బోటింగ్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా యాత్రికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు, భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరిలో నీటి మట్టం తక్కువగా ఉన్నప్పటికీ ప్రమాదాలు ఎప్పుడైనా సంభవించే అవకాశం ఉండగా, భద్రతా చర్యలు తీసుకోకుండా బోటింగ్ నిర్వహించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ముఖ్యంగా బోట్లలో కనీసం సేఫ్టీ జాకెట్లు లేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఒకే బోటులో ఎక్కువ మంది యాత్రికులను ఎక్కించడం వంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పర్ణశాల... శ్రీరాముడు వనవాసం గడిపిన పవిత్ర ప్రదేశంగా ప్రసిద్ధి గాంచింది. భద్రాచలంకు వచ్చే ప్రతి భక్తుడు ఈ ప్రాంతాన్ని సందర్శించడం ఆనవాయితీగా మారింది. గోదావరి అందాలను వీక్షించేందుకు యాత్రికులు బోటింగ్‌పై ఆసక్తి చూపుతుండగా, భద్రతా ప్రమాణాలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. ప్రతి శని, ఆదివారాల్లో వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి వచ్చి బోటింగ్‌లో పాల్గొంటున్నారు. అయితే బోటింగ్ యాజమాన్యం అధికారులు నిర్దేశించిన నియమ నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులకు ఈ విషయం తెలిసినా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల రద్దీ పెరుగుతుండగా, 27వ తేదీన జరగనున్న సీతారామచంద్రస్వామి కల్యాణానికి మరింత మంది భక్తులు తరలివచ్చే అవకాశముంది. ఈ నేపథ్యంలో పర్ణశాల పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు వెంటనే స్పందించి బోటింగ్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుని, భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరు

**- ఏప్రిల్ మొదటివారంలో మరో సారి సమావేశం**
**- రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం**



**హైదరాబాద్, మార్చి 24, (తెలంగాణ దిశ)** :నగరంలోని ఎఫ్‌డీసీ బోర్డు రూమ్‌లో మంగళవారం రాష్ట్ర మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ప్రెస్ అకాడమీ, ఎస్ఎంఏసీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఎస్ఎంఏసీ కో చైర్‌పర్సన్ సీహెచ్ ప్రియాంకతో కలిసి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అక్రిడిటేషన్ కోసం జర్నలిస్టులు సమర్పించిన దరఖాస్తులను కమిటీ సభ్యులు సమగ్రంగా పరిశీలించారు. జర్నలిస్టుల నుంచి అందిన ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని, అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు కార్డు మంజూరులో ఎలాంటి లోపం ఉండదని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ కమిటీ సమావేశాన్ని వచ్చే నెల మొదటివారంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన జర్నలిస్టులు ఆన్‌లైన్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లాల వారీగా కలెక్టర్లు పంపే 'జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)' ప్రతిపాదనలను కూడా పరిశీలించి ఆమోదం తెలుపుతుందని వెల్లడించారు. ఈ మేరకు జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ కిషోర్ బాబు, అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్ పాటు ఇతర కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

# షాపూర్ నగర్ మార్కెట్‌లో క్షయ వ్యాధి (టిబి)పై అవగాహన సదస్సు




**కుత్బుల్లాపూర్, మార్చి 24, (తెలంగాణ దిశ)** : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్ నగర్ డివిజన్ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో మంగళవారం క్షయ వ్యాధి (టిబి) నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి నర్సింగ్ ఇన్స్టిట్యూషన్స్ సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల ప్రజలకు సరైన అవగాహన అవసరమని అన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి తక్షణ చికిత్స తీసుకోవాలని సూచించారు. మల్లారెడ్డి నర్సింగ్ కాలేజీ విద్యార్థులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. స్కిట్ (నాటిక) ద్వారా క్షయ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే పౌష్టికాహారం ప్రాముఖ్యతను ప్రజలకు స్పష్టంగా వివరించారు. క్షయ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుందని వారు తెలియజేశారు. నర్సింగ్ విద్యార్థుల ప్రదర్శన మార్కెట్‌కు వచ్చిన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ఇంచార్జ్ డాక్టర్ బాలసుబ్రమణ్యం, అరుణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ, ముకుంద రావు, రవికుమార్, సాజిద్, సంజీవ, షాబుద్దీన్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.




# స్పోర్ట్స్ అథారిటీ పిఆర్ఓ కాలేరు సురేష్‌కు ఘనంగా సన్మానం




**హైదరాబాద్, మార్చి 24, (తెలంగాణ దిశ)** :తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలతో పాటు రెండవ విడత సీఎం కప్ పోటీల విజయవంతమైన నిర్వహణలో విశిష్ట సేవలు అంద జేసిన స్పోర్ట్స్ అథారిటీ పిఆర్ఓ కాలేరు సురేష్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ఒలింపియన్ సైనా నెహ్వాల్, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి కలిసి కాలేరు సురేష్‌కు అభినందనలు తెలిపారు. సీఎం కప్ పోటీల నిర్వహణలో ఆయన చేసిన కృషి, సమన్వయం, క్రీడల అభివృద్ధికి అందించిన సేవలను ప్రశంసిస్తూ జ్ఞాపికను అందజేశారు . క్రీడాకారులకు ప్రోత్సాహం కలిగించే ప్రతి ఒక్కరికి తెలంగాణలో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. క్రీడా రంగానికి సేవలందిస్తున్న అధికారులను ప్రోత్సహించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

# ఎల్‌ఓసి పత్రాల పంపిణీ లబ్ధిదారులకు ఆర్థిక భరోసా



**కుత్బుల్లాపూర్, మార్చి 24, తెలంగాణ దిశ)** : ఆపద సమయంలో ప్రజలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి పత్రాలను మంగళవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ రాజీవ్ గృహకల్పకు చెందిన కుమారి వావిలాల పూర్ణిమ, ప్రగతినగర్‌కు చెందిన రోళ్ళకంటి రాజు లకు ఎల్ఓసి పత్రాలను అందజేశారు. ఈ పత్రాలను నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షుడు రంగారాయ ప్రసాద్, నాయకుడు పరుష సత్యనారాయణ యాదవ్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆపద సమయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా వావిలాల పూర్ణిమ తండ్రి వి. వెంకటేశ్వర్ రెడ్డి కు రూ. 6 లక్షలు, రోళ్ళకంటి రాజు తండ్రి రోళ్ళకంటి దేవదాసుకు రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

